క్లుప్తంగా

బీమా చెక్కు అందజేత



మృతుని భార్యకు చెక్కును అందజేస్తున్న కోళ్ల బాబు, డైరెక్టర్లు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరంలో ది ఇన్నీసుపేట కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ సభ్యుడు పాకలపాటి జీవన్‌కుమార్ ఇటీవల ప్రమాదంలో మరణించారు. ఆయన భార్య పాకలపాటి రమణకు రూ.లక్ష ప్రమాద బీమా చెక్కును శుక్రవారం అందించారు. బ్యాంక్ కార్యాలయంలో చైర్మన్ కోళ్ల అచ్యుత రామారావు(బాబు), డైరెక్టర్లు ఈ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ వైస్ చైర్మన్ గేడి పోతురాజు, డైరెక్టర్లు అందనాపల్లి సత్యనారాయణ, కటారి శ్రీనివాస్ కన్నా, నారపురెడ్డి సన్యాసిరావు, జామి వెంకటరమణమూర్తి, పంచకట్ల శివ, దాది సత్యనారాయణ, గుత్తుల భాస్కరరావు, రెడ్డి సూర్యసుబ్రహ్మణ్యం, వీవీఎస్‌పీ రామచంద్రరావు, సీతఊట పాలకోడేటి రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఆర్థిక చేయూత

ప్రకాశంనగర్: ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ పసుపులేటి శ్రీరామమూర్తి అదే కళాశాలకు చెందిన క్రీడాకారుడైన విద్యార్థి బి.మోహన్‌రావుకు శుక్రవారం ప్రిన్సిపాల్ కార్యాలయంలో రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రాజబాబు మాట్లాడుతూ హాఫ్ మారథాన్(21 కి.మీ.) విభాగంలో రెండేళ్లుగా ఈ విద్యార్థి కళాశాలకు బంగారు పతకాలు సాధించినట్టు తెలిపారు. క్రీడాకారుడిని ప్రోత్సహించి, సాయం అందించిన పసుపులేటి శ్రీరామమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వ్యాయామ అధ్యాపకుడు పీఏ కిషోర్‌బాబు, అధ్యాపకులు పీవీబీ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షలో 526 మందికి సేవలు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట డి–బ్లాకులో గ్రామ సచివాలయం–2 పరిధిలో శుక్రవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష 2.0 వైద్య శిబిరంలో 526 మంది వైద్య సేవలు పొందారు. ముగ్గురిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యురాలు డా.లిడియా సుచిత్ర ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్య నిపుణులు డా.రామ్మోహన్, డా.రాజేంద్ర బాబు, ఆఫ్తాల్మిక్ ఆఫీసర్ డి.సాంబయ్య వైద్య సేవలందించారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు, బీపీ పరీక్షలు నిర్వహించారు. అలాగే ఈసీజీ పరీక్షలు చేశారు. అనంతరం వైద్యుల సిఫార్సు మేరకు ఉచితంగా మందులను అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గుంట్రు వెంకటరావు, వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఖాతాలు స్తంభింపజేయడం దారుణం

రాజమహేంద్రవరం సిటీ: కేంద్రంలో మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ ఖాతాలు స్తంభింపజేయడం దారుణమని పీసీసీ అధికార ప్రతినిధి కొవ్వూరి శ్రీనివాసరావు శుక్రవారం ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ ఖాతాలను ఐటీ శాఖ స్తంభింపజేయటం వెనుక కేంద్ర ప్రభుత్వ కుట్ర ఉందని ఆరోపించారు. ఎన్నికల ఫండ్ ఖాతాలన్నీ స్తంభింపజేయడంపై మేధావులంతా స్పందించాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు.

విశాఖ డ్రగ్స్‌పై సమగ్ర విచారణ జరపాలి

రాజమహేంద్రవరం రూరల్: విశాఖ పోర్టులో పట్టుబడిన 25 వేల కిలోల డ్రగ్స్ రాకెట్‌పై సమగ్ర విచారణకు ఆదేశించాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, స్థానిక ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని తన నివాసంలో మీడియాతో శుక్రవారం ఆయన మాట్లాడారు. డ్రగ్స్ దిగుమతిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు.

సినిమాలు

శ్యామల	: భీమా
సూర్యమినీ	: మడ్గావ్ ఎక్స్‌ప్రెస్(హిందీ)
సూర్యప్యాలెస్	: నువ్వు– నేను, కుంగ్‌ఫూ పాండా–4
స్వామి	: ఓం భీమ్ బుష్.
శివజ్యోతి	: ఓం భీమ్ బుష్.
అనుశ్రీ	: ప్రేమలు
రాజా	: లైన్‌మెన్
ఊర్వశి	: లైన్‌మెన్, రజాకార్
రంభ	: తంత్ర
మేనక	: యమధీర, పక్కిరి
అప్సర	: గామి
కుమారి	: ప్రేమలు
నామవరం	
వివిఎస్.మహల్	: ఓం భీమ్ బుష్.
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: ఓం భీమ్ బుష్.
కడియం	
వెంకటసూర్య	: ఓం భీమ్ బుష్.

ఆత్మరక్షణకు కరాటే

- పలు విభాగాల్లో సత్తా చాటుతున్న బాలికలు
- గ్రాండ్ చాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానం సాధించిన శ్రీలక్ష్మీలత



కరాటేలో శిక్షణ పొందుతున్న దృశ్యం



గ్రాండ్ చాంపియన్‌షిప్‌లో స్పారింగ్ సాధించిన శ్రీలక్ష్మీలతను అభినందిస్తున్న ఎంపీ భరత్‌రామ్

ప్రకాశం నగర్: ఆత్మరక్షణ కోసం కొందరు, హాబీగా కొందరు శిక్షణ పొందుతున్న కరాటేలోని సెల్ఫ్ టెక్నిక్స్ విభాగంలో అనేక మెళకువలు నేర్చుకుంటున్న క్రీడాకారులు, ప్రత్యర్థిని మట్టికరిపించే రీతిలో శిక్షణ తీసుకుంటున్నారు. కరాటేలో విద్యార్థిని, విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొంది, పలు పతకాలు సాధిస్తున్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో, కరాటే వంటివి వారిలో ఆత్మస్థయిర్యాన్ని పెంచడంతో పాటు, ఆపదలో అదుకునేలా ఉంటాయని ట్రైనర్లు చెబుతున్నారు. మిగిలిన క్రీడలతో పోలిస్తే, కఠోర శిక్షణ, ఏకాగ్రత, క్రమశిక్షణతో కూడుకున్న కరాటేలో రాణించడం అంత సులభం కాదని విశ్లేషకులు అంటున్నారు. అయినా ఇటీవల కాలంలో పలు కరాటే పోటీల్లో బాలికలు పైచేయి సాధిస్తుండడం విశేషం.

సత్తా చాటుతున్న బాలికలు

కరాటేలో పోటీల్లో గ్రాండ్ చాంపియన్‌షిప్ (నేషనల్ విభాగం)లో ద్వితీయ స్థానం సాధించిన ఎస్.శ్రీలక్ష్మీలతతో పాటు, పోటీల్లో శిక్షణ తీసుకుని, వివిధ బెల్టులకు ఎంపికైన క్రీడాకారులకు ఇటీవల ఎంపీ మార్గాని భరత్‌రామ్ బెల్ట్ గ్రేడింగ్ సర్టిఫికెట్లను అందజేశారు. ఇందులో బాలురతో పోలిస్తే బాలికలే అధిక శాతం వివిధ బెల్టులకు అర్హత సాధించి, విజేతలు కావడం విశేషం. మొత్తం 19 మంది కరాటేలో వివిధ బెల్టులు సాధించగా, వీరిలో 11 మంది బాలికలు, ఎనిమిది మంది బాలురు ఉన్నారు. వీరందరూ ఆయా పాఠశాలల్లో చదువుకుంటునే, కరాటేలో శిక్షణ పొందుతున్నారు.

క్రీడా అభ్యున్నతికి పెద్దపీట

ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించడంతో పాటు, క్రీడాభ్యున్నతికి పెద్ద పీట వేస్తోందని పలువురు క్రీడా విశ్లేషకులు చెబుతున్నారు. స్కూల్ గేమ్స్‌తో పాటు, ఆడుదాం ఆంధ్రా వంటి పోటీలను నిర్వహించి, గ్రామీణ స్థాయిలో క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆటల పోటీలు నిర్వహించడంతో పాటు, విజేతలకు నగదు ప్రోత్సాహకాలు అందించడంతో క్రీడాకారులూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం కూడా బాలికల్లో ఆసక్తి పెరగడానికి కారణమని పలువురు పేర్కొంటున్నారు.

బాలికల్లో పెరుగుతున్న ఆసక్తి



కరాటే పోటీల్లో బాలురతో పోలిస్తే బాలికలే పలు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి, పతకాలు కైవసం చేసుకుంటున్నారు. సుమారు 20 మంది నా వద్ద కరాటేలో శిక్షణ తీసుకుంటున్నారు. వీరిలో పలువురు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించడంతో పాటు, జాతీయ స్థాయి పోటీలకు సైతం ఎంపికవ్వడం గర్వకారణంగా ఉంది. జాతీయ స్థాయి కరాటే పోటీల్లో సైతం క్రీడాకారులు పతకాలు సాధించడమే ధ్యేయంగా కరాటేలో శిక్షణ ఇస్తున్నాను.

– పిల్లి అరుణ్‌కుమార్, కరాటే మాస్టర్

గోల్డ్ మెడల్ సాధించడమే లక్ష్యం



కరాటే గ్రాండ్ చాంపియన్‌షిప్ స్పారింగ్‌లో (నేషనల్స్) ద్వితీయ స్థానం కైవసం చేసుకోవడం ఆనందంగా ఉంది. జాతీయ పోటీల్లో ప్రథమ స్థానం, గోల్డ్ మెడల్ సాధించడమే లక్ష్యంగా శిక్షణ తీసుకుంటున్నాను.

– ఎస్.శ్రీలక్ష్మీలత, కరాటే క్రీడాకారిణి

ఓటర్లలో చైతన్యానికే కవాతు

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ ఆర్‌ఓ, జేసీ తేజ్‌భరత్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఎన్నికల నేపథ్యంలో ఓటర్లలో చైతన్యం తీసుకురావడానికి నియోజకవర్గ పరిధిలో పోలీసులు, సైనికులతో కవాతు నిర్వహిస్తున్నట్టు రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ అన్నారు. శుక్రవారం సాయంత్రం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద పోలీసులు, సైనిక కవాతును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ తేజ్‌భరత్ మాట్లాడుతూ స్వేచ్ఛగా, నిర్భయంగా ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం ఓటరు అవగాహన కల్పిస్తున్నట్టు వివరించారు. ఈ కవాతు ఎన్టీఆర్ విగ్రహం, శ్రీనివాస హాస్పిటల్, ఎస్‌బీఐ ఇన్నీస్‌పేట, జోడుగుళ్ల , విశ్వనాథ హాస్పిటల్, కాశేపల్లి స్వర్ణకారుడు వీధి, కుమారి థియేటర్ వెనుక వైపు, టి బార్, కేఆర్ ఫ్రూట్ జ్యూస్ సెంటర్, వరలక్ష్మి గుడి వీధి, సప్పవారి వీధి, దుక్కల దొడ్డి, శివరామ ఫొటో స్టూడియో మీదుగా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వద్ద ముగిసింది. టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరావు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



కవాతును ప్రారంభిస్తున్న ఆర్‌ఓ, జేసీ తేజ్‌భరత్

ఎన్నికలు సజావుగా సాగేందుకు సహకరించాలి

కడియం: రానున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్ కోరారు. కడియం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున విధానపరమైన నిర్ణయాలేవీ సమావేశంలో ప్రస్తావించలేదు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, పలువురు సభ్యులు అధికారులను కోరారు. అనంతరం ఎంపీడీఓ రాజ్‌మనోజ్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అదనంగా ఏడు పోలింగ్ స్టేషన్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఓ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: ఓటర్ల సంఖ్య ఆధారంగా రాజమహేంద్రవరం సిటీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఏడు అదనపు పోలింగ్ స్టేషన్లను గుర్తించి, ఎన్నికల సంఘానికి నివేదించినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కమిషనర్ దినేష్‌కుమార్ వెల్లడించారు. గతంలో 225 పోలింగ్ స్టేషన్లు ఉండగా, ప్రస్తుతం ఏడు అదనమని వివరించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో సిటీ నియోజకవర్గ పరిధిలోని అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో పాటించవలసిన విధివిధానాలను వివరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగటానికి రాజకీయ పార్టీలన్నీ సహకరించాలన్నారు. ఇకపై ఓట్లు తొలగించడానికి ఎటువంటి దరఖాస్తులు స్వీకరించడం కుదరదన్నారు. ఓట్ల నమోదు కోసం దరఖాస్తులు ఏప్రిల్ 15 వరకూ తీసుకుంటారన్నారు. ఇప్పటివరకు అన్ని రకాల దరఖాస్తులు పరిష్కరించారన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో మొత్తం 232 పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ జరుగుతుందన్నారు. వలంటీర్లను ఎన్నికల విధుల్లో పాల్గొనకుండా నిషేధించామన్నారు. ఎన్నికలకు సంబంధించి సమావేశాలు, ఊరేగింపులకు సువిధ యాప్‌లో 48 గంటల ముందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, అర్బన్ తహసీల్దార్ కె.ఆంజనేయులు, డీఎస్పీ సెంట్రల్, సీఐలు, ఎన్నికల డీటీలు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే..

- నేడు శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవం
- తొమ్మిదో శతాబ్దం నాటి దేవాలయం



కోరుకొండలో శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి ఆలయం (అంతరచిత్రం) రంగనాథ స్వామివారు

మధురపూడి: కోరుకొండ అగ్రహారంలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథ స్వామివారి కల్యాణ మహోత్సవం శనివారం రాత్రి జరుగుతోంది. శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి సమీపంలోని ఆలయంలో.. నిలబడి ఉన్న రంగనాథ స్వామిని దర్శించుకోవచ్చు. నరసింహస్వామి దేవస్థానం కంటే పూర్వం తొమ్మిదో శతాబ్దంలోనే స్వామివారి ఆలయాన్ని నెలకొల్పారు. స్వామివారి ఉత్సవాలకు సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు హాజరవుతారు.

నేటి రాత్రి కల్యాణం

వైఖానస ఆగమం ప్రకారం కల్యాణం రంగరంగ వైభవంగా జరుగు తోంది. వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ ఉత్సవాలు జరుగుతాయి. స్వామివారి ఆలయంలో శనివారం రాత్రి 7–30 గంటలకు కల్యాణం ప్రారంభమై, రాత్రి 11 గంటలకు ముగుస్తోంది. ఆలయ అర్చకుడు పెదపాటి నరసింహ గిరిధర్ పర్యవేక్షణలో వేడుకలు జరుగుతాయి. ఈ ఉత్సవాలను శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజు బట్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. తొలుత గోదాదేవి అమ్మవారు, రంగనాథ స్వాములకు మంగళ స్నానాలను నిర్వహిస్తారు. అనంతరం పట్టువస్త్రాల అలంకృతులై పెళ్లి పీటలపై కూర్చుంటారు. వేద పండితుల మంత్రోచ్ఛరణతో కల్యాణం జరుగుతోంది.

నివాస గృహంలా ఆలయం

శ్రీలక్ష్మీనరసింహస్వామి కంటే ముందే రంగనాథ స్వామి నెలకొల్పబడ్డారు. తొమ్మిదో శతాబ్దంలో ఏర్పడిన దేవాలయం నివాస గృహం తరహాలో ఉంటుంది. విదేశీయుల దండయాత్రల బారిన పడకుండా ఉండడానికి పూర్వీకులు నివాస గృహంలా నిర్మించారు. ఆలయ ప్రాంగణంలో ధ్వజ స్తంభం లేకపోవడం విశేషం. అలాగే గాలి గోపురాన్ని ఇటీవల ఏర్పాటు చేశారు. శ్రీరంగనాథస్వామికి అల్లూరి సీతారామరాజు జిల్లా భూపతిపాలెంలో 1,100 ఎకరాల భూమి ఉండేది. ఇదంతా కాలక్రమేణా అన్యాక్రాంతమైంది.

వైఖానస ఆగమం ప్రకారం కల్యాణం



కోరుకొండలోని శ్రీదేవి, భూదేవీ సమేత రంగనాథస్వామి కల్యాణోత్సవాలు వైఖానస ఆగమం ప్రకారం నిర్వహించబడతాయి. రాత్రి 7–30 నుంచి 11 గంటల వరకూ వేద పండితుల మంత్రోచ్ఛరణతో వివాహ వేడుకలు జరుగుతాయి. ఏటా నిర్వహిస్తున్న పద్ధతిలోనే శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజు బట్టర్ ఆధ్వర్యంలో వేడుకలు జరుగుతాయి.

– పరాసర నరసింహ గిరిధర్, అర్చక స్వామి

వెల్లివిరుస్తున్న ఆధ్యాత్మిక భావం



శ్రీదేవీ, భూదేవి సమేత రంగనాథస్వామి కల్యాణోత్సవాల సందర్భంగా ఆధ్యాత్మిక భావం వెల్లివిరుస్తోంది. కోరుకొండ అగ్రహారంలో శనివారం ప్రత్యేకమైన సందడి ఏర్పడుతోంది. లక్ష్మీనరసింహస్వామి కంటే ముందే రంగనాథస్వామి ఆలయం ఏర్పడింది.

– కేతినీడి అశోక్, స్థానిక భక్తుడు

సామాజిక సమస్యలపై అవగాహన ర్యాలీ



సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు ఇచ్చిన ఎస్సై, ప్రిన్సిపాల్

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నాగరత్నం కాలనీలో ఐదో రోజు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సామాజిక సమస్యలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.సుధామయి ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంపులో సింగవరం పంచాయతీ పరిధిలోని నాగరత్నం కాలనీలో బాల్య వివాహాలు, వెట్టిచాకిరి, పౌష్టికాహారం, రక్తహీనత వంటి పలు సమస్యలపై అవగాహన కల్పించారు. మధ్యాహ్నం ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సీతానగరం ఎస్సై టి.రామకృష్ణ పాల్గొన్నారు. సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆధునిక యుగంలో సైబర్ క్రైమ్‌లు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. సెల్‌ఫోన్లలో వచ్చే లింకులను ఓపెన్ చేయరాదన్నారు. బ్యాంకుల పేర్లతో ఓటీపీ అడిగి, నగదును ఖాతాల నుంచి ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారని, వీటిపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వివరించారు. గురువారం పలు అంశాలపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు, ఎస్సై రామకృష్ణ ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ మాధవ్, వాణి, అలేఖ్య, మనోహరి, వెంకటేష్ శివప్రసాద్, ఫణీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కంబాలచెరువు: రోడ్డు కం రైల్వే బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామానికి చెందిన ఇ.కొండలరావు (30) మృతి చెందాడు. దీనిపై రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. రాజమహేంద్రవరంలోని బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వెళ్తుండగా రోడ్డు కం రైల్వే బ్రిడ్జిపై మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తూ బైక్‌పై నుంచి కింద పడిపోయాడు. తీవ్రగాయాల పాలైన కొండలరావు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నరసింహస్వామికి ఘనంగా సదస్యం

మధురపూడి: కోరుకొండలో కొలువుదీరిన స్వయంభూ శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల మూడో రోజు శుక్రవారం సదస్యం జరిగింది. నవ దంపతులైన స్వామి, అమ్మవార్లను వేద పండితులు ఆశీర్వచనం అందించారు. దేవస్థాన అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజ బట్టర్ ఆధ్వర్యంలో స్థానిక కల్యాణ మంటపంలో ఉభయ వేదాంత పండితుల సమక్షంలో సదస్యం జరిగింది. ఈ సందర్భంగా మంత్రోచ్ఛరణతో దేవస్థానం మార్మోగింది. సదస్యం కార్యక్రమంలో బూర్లు ప్రసాద వినియోగం జరిగింది. అనంతరం స్వామివారికి ఆంజనేయ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం కూడా భక్తుల తాకిడి తగ్గలేదు. ఉదయం ఆలయం తలుపులు తెరిచి, ఆరాధన, సర్వదర్శనాలకు అనుమతి కల్పించారు.

నీటితోనే శాంతి.. విధ్వంసం

వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ రమణమూర్తి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రమణమూర్తి

రాజమహేంద్రవరం రూరల్: శాంతిని చేకూర్చకలిగే శక్తి, విధ్వంసాన్ని సృష్టించగలిగే సామర్థ్యం నీటికి ఉందని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కేవీ రమణమూర్తి అన్నారు. కాతేరులోని శుక్రవారం వ్యవసాయ కళాశాలలో ప్రపంచ జల దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డా.రమణమూర్తి మాట్లాడుతూ నీటి కొరత లేకుండా, నీరు కలుషితమైనప్పుడు లేదా ప్రజలు ప్రాప్యత కోసం పోరాడుతున్నప్పుడు సమాజంలో ఉద్రిక్తతలు తలెత్తుతాయని విశ్లేషించారు. నీటి అవసరాలను సమన్వయం చేసుకోవడం ద్వారా శాంతి సాధ్యమన్నారు. సుస్థిరమైన నీటి వినియోగం చుట్టూ ఐక్యం కావడం ద్వారా సమాజాలు, దేశాల మధ్య సామరస్యాన్ని పెంపొందించాలని వివరించారు. జాతీయ సేవా పథకం అధికారులు సునీత, డా.రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు డా.అనురాధ, డా.ప్రవీణ, డా.నిర్మల రవికుమార్, డా.దక్షిణామూర్తి, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

రాజమహేంద్రవరం రూరల్: లాలాచెరువు బత్తిననగర్‌లో ఒక ఇంటిలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం మధ్యాహ్నం బొమ్మూరు పోలీస్ స్టేషన్ ఎస్సై బి.శ్రీను తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో 11 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.1.15 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రీను తెలిపారు.



14వ వార్డు తాడితోట నూర్ మసీదు ఇఫ్తార్ విందులో పాల్గొన్న రాజమహేంద్రవరం ఎంపీ, సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్

కడుపు నిండుగా.. దాతృత్వం మెండుగా..

- సేవకు చిరునామా రెడ్డి పంతులు సత్రం
- కల్యాణోత్సవాల్లో వేలాది మందికి భోజన వసతి



కోరుకొండ విరియాల వెంకటరెడ్డి సత్రం



కోరుకొండ సత్రంలో భోజనం చేస్తున్న భక్తులు

మధురపూడి: మండల కేంద్రమైన కోరుకొండలో విరియాల వెంకటరెడ్డి పంతులు సత్రం సేవకు చిరునామాగా నిలిచింది. శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భక్తులకు భోజన వితరణ ఈ సత్రం ప్రత్యేకత. కోటికేశవరం గ్రామానికి చెందిన వెంకటరెడ్డి సంకల్పంలో భాగంగా 1918లో దీనిని నెలకొల్పారు. అప్పటి నుంచి ఉత్సవాల సందర్భాల్లో నేటికీ వేలాది మంది భక్తులకు భోజనం అందిస్తున్నారు. ఉత్సవాలు ముగిసే వరకూ స్వామివారి కల్యాణానికి వచ్చిన వేలాది మంది భక్తులకు సంతృప్తిగా భోజనం అందిస్తుంటారు.

ఐదు రోజులూ నిరంతరయంగా..

నరసింహస్వామి కల్యాణ ఉత్సవాలు నిర్వహించే ఐదు రోజులూ భక్తులకు సత్రంలో భోజన సదుపాయం ఉంటుంది. ఈఓ పాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులందరికీ భోజనాన్ని సమకూరుస్తారు. ప్రతిరోజూ మధ్యాహ్నం, రాత్రివేళల్లో భక్తులకు అన్న సమారాధన జరుగుతోంది. బుధవారం నుంచి శుక్రవారం వరకూ వేలాది మందికి భోజనాన్ని అందించారు.

తరిగిన ఆస్తి

రెడ్డి పంతులు సత్రం ఆస్తంతా తరిగిపోయింది. దాదాపు 20 వేల ఎకరాల పొలాలు సత్రానికి ఆస్తిగా ఉండేవి. నేడు 123.53 ఎకరాలకు తగ్గిపోయింది. సీతానగరం మండలం నల్లగొండలో 20 వేల ఎకరాల ఆస్తి ల్యాండ్ సీలింగ్‌లో పోయింది.